చెత్త తరలింపులోనూ అవినీతి కంపు

- పీవీకే నాయుడు మార్కెట్ వద్ద చెత్త తరలింపులో అక్రమాలు
- కాంట్రాక్టర్ పనిని పారిశుద్ధ్య కార్మికులతో చేయించిన విభాగ అధికారులు
- ఫిర్యాదు రావడంతో నిజమే అని తేల్చిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్
- రూ.3,75,600 చెల్లించాలని కాంట్రాక్టర్‌కు రెవెన్యూ విభాగ అధికారులు నోటీసులు జారీ


నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో ప్రతి విభాగంలో అక్రమాలు ఏదొక రూపాన బయటకు వస్తూనే ఉన్నాయి. మొన్న అకౌంటెంట్ విభాగంలో కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన నగదు సొంత ఖాతాలకు చెల్లించిన విషయం తెలిసిందే. ఈ మధ్య కొత్తగా ప్రజారోగ్య విభాగంలో మరొక అక్రమం బయటపడింది. ప్రజారోగ్యధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారు. కాంట్రాక్టర్ చేయాల్సిన పనిని ప్రజారోగ్య సిబ్బందితో కొన్నేళ్లుగా చేయించుకుంటూ వస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో స్పందించిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విషయం వాస్తవమేనని తేల్చడంతో నగరపాలక సంస్థ రెవెన్యూ శాఖ సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసింది.

మున్సిపల్ సిబ్బందితో పనులు

పీవీకే నాయుడు మార్కెట్ లోపల, బయట ఉత్పన్నమయ్యే చెత్తను కేవీపీ కాలనీలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకు, వ్యాపారుల నుంచి రుసుం వసూలు చేసుకునేందుకు హక్కును 01-04-2022 నుంచి 31-03-2023 వరకు రూ.43,94,319కు ఓ మహిళా కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. అయితే, ఆమె మార్కెట్ లోపల మాత్రమే చెత్త తరలిస్తోంది. బయట ఆకుకూరలు అమ్మే వారి వద్ద ఉత్పన్నమయ్యే చెత్తను అలాగే వదిలేస్తోంది. దాన్ని మున్సిపాల్ కార్మికులతో డంపర్ బిన్లలో వేయించి తరలించేవారని, ఇందుకు గాను సదరు కాంట్రాక్టర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, ప్రజారోగ్యధికారులకు మామూళ్లు ఇచ్చుకునే వారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్‌ఓ) భాను ప్రకాష్ విచారణ చేశారు. కాంట్రాక్టర్ చేయాల్సిన పనిని పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్నారని, దీనివల్ల రోజుకు రూ.1200 ఖర్చు అవుతోందని రెవెన్యూ విభాగానికి రిమార్క్స్ రాసి పంపారు. దీనిపై స్పందించిన అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు రూ.3,75,600ను మున్సిపాలిటీ చెల్లించాలని నోటీసులు అందజేశారు.

కమర్షియల్ చెత్త తరలింపులో కూడా అవకతవకలు?

కమర్షియల్ చెత్త తరలింపుకు కూడా ప్రత్యేకంగా కాంట్రాక్టర్ ఉన్నారు. అయితే, ఇందులోనూ అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 10,173 కమర్షియల్ కలెక్షన్ పాయింట్ ఉన్నాయి. వీటిలో 1,436 పాయింట్స్‌ను ఓ కాంట్రాక్టర్ చేసుకుంటుండగా, 2,049ను మరొక కాంట్రాక్టర్ నిర్వహించుకుంటున్నారు. మిగిలిన 6,688 కలెక్షన్ పాయింట్ల నుంచి నగరపాలక సంస్థ ద్వారా చెత్త తరలిస్తున్నారు. అయితే, ఇక్కడ కూడా కాంట్రాక్టర్ చెత్త తరలించకుండానే రోడ్డు మీద డంపర్ బిన్స్‌లో వేసి నగరపాలక సంస్థ ట్రాక్టర్ల ద్వారా చెత్త తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కాంట్రాక్టర్‌కుఉ నోటీసులు ఇప్పించాం

పీవీకే నాయుడు మార్కెట్ వెలుపల ఆకుకూరలు వద్ద ఉత్పన్నమయ్యే చెత్తను కాంట్రాక్టర్ కాకుండా పారిశుద్ధ్య కార్మికులు తరలిస్తున్నారనే విషయం వాస్తవమే. నగరపాలక సంస్థ తరఫున రోజూ 800 కేజీల చెత్త తరలించినందుకు గాను రూ.1200 చొప్పున, ఈనెల 7వ తేదీ వరకు రూ.3,75,600ను నగరపాలక సంస్థకు చెల్లించాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు అందజేశాం.

– డాక్టర్ భాను ప్రకాష్, ఎంహెచ్‌ఓ

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ


పెన్షన్లు పంపిణీ చేస్తున్న రాంబాబు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వ్యాపారవేత్త కనమర్లపూడి రాంబాబు మాట్లాడుతూ ప్రతి నెలా 100 మంది పేదలకు రూ.400 చొప్పున పెన్షన్లుగా ఇవ్వడం అభినందనీయమన్నారు. అవోపా సేవా కార్యక్రమాలకు సహాయాన్ని అందిస్తానని తెలిపారు. అనంతరం ప్రముఖ వైద్య నిపుణుడు కె. రామలింగేశ్వరరావు పేదలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా చారిటబుల్ చైర్మన్ కొత్తమాసు శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు, రమణానంద్, జనార్దన్‌రావు, రవికుమార్, అవోపా కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హక్కులపై 25న అవగాహన సదస్సు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూనగర్: అన్ని రంగాల్లో దళిత బహుజనులు చైతన్యమై హక్కుల్ని సాధించుకోవడం కోసం, రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు భీమ్ భారత్ ఆధ్వర్యంలో ఈ నెల 25న పాత గుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో దళిత బహుజన రాజకీయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ తెలియజేశారు. సదస్సు కరపత్రాల్ని ఆదివారం అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బహుజనులు, అణగారిన కులాలు రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా తరతరాలుగా అన్ని రంగాల్లో వెనకబడి ఉండటానికి కారణం రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన లేకపోవడం వల్లనేనని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగహన కలిగి ఉండటం కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జల్ది మోహన్, దొడ్డ రాజేంద్రప్రసాద్, కమల కుమారి, ఉప్పలపాటి ముని పాల్గొన్నారు.

పూడికతీత పనులు వెంటనే చేపట్టండి


ఔట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నగరం నుంచి మురుగునీరు బయటకు వెళ్తున్న ఔట్‌ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేయాలని జీఎంసీ అధికారుల్ని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. ఆదివారం కాకాని రోడ్డులోని ఆటోనగర్ ప్రాంతంలో ఔట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు అసంపూర్తిగా ఉండటాన్ని గమనించి, వెంటనే వాటిని పూర్తి చేయాలని చెప్పారు. రానున్న వేసవిలో అన్ని డ్రెయిన్లలో పూడికతీత పనులు చేయించాలని సూచించారు. తాత్కాలికంగా వ్యర్థాల్ని తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి యడ్లపాటి


యడ్లపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉంటూ పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి యడ్లపాటి వెంకట్రావు అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొనియాడారు. రాజ్యసభ మాజీ సభ్యుడు యడ్లపాటి వెంకట్రావు ప్రథమ వర్ధంతిని గాంధీనగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించారు. పలువురు యడ్లపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యడ్లపాటి జీవితం యువ రాజకీయ నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా యడ్లపాటి చేసిన అభివృద్ధి మరువరానిదని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, బాపట్ల అర్బన్ డెవలెప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోనినేని ఉమ, పలువురు టీడీపీ, వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు ఉన్నారు.

రంగస్థల కళాకారుడు రవివర్మకు సన్మానం


రవివర్మ తదితరులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో ఆదివారం సాయంత్రం చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ సమ సమాజ దృష్టి అనే అంశంపై వెంపటి సత్యనారాయణ, కొల్లూరు బసవయ్య ప్రసంగించారు. అనంతరం వక్తలతో పాటు ప్రముఖ రంగస్థల కళాకారుడు యడ్ల రవివర్మను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, ఉమ్మలనేని ధర్మారావు, దేవిశెట్టి భాస్కర్, బడుగు మోహనరావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, హృదయరాజు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో బీజేపీ విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాని

తెనాలి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో విద్యార్థి సంఘాల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాల్ని భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, విమానం, బ్యాంకింగ్ వంటి రంగాలను కూడా ప్రైవేటు పరం చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం ముందడుగు వేస్తుందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని హితువు పలికారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ తెనాలి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.కొండబాబు, పల్నాటి నాగరాజు, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, కె.గోపి, సహాయ కార్యదర్శిగా పి.భానుచందర్, కోశాధికారిగా పి.అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, సీపీఐ ఏరియా కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ పాల్గొన్నారు.

‘ఉసా’ ఆలోచన విధానం నేటి సమాజానికి అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

నెహ్రూనగర్: సామాజిక తత్వవేత్త ‘ఉసా’ (ఉప్పుమావులూరు సాంబశివరావు) ఆలోచన విధానం నేటి సమాజానికి ఎంతో అవసరమని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలియజేశారు. ఉసా 73వ జయంతి సభ పాత గుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ‘ఉసా’ దళితులు, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడిన యోధుడని కొనియాడారు. ఆయన గొప్ప రచయితని, ఆయన ఆలోచనలు, రచనలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. నాయీ బ్రాహ్మణ జేఏసీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు మాట్లాడుతూ ‘ఉసా’ జీవితం పీడిత వర్గాలకు ఒక గొప్ప గ్రంథం అన్నారు. ఆయన ఆశయాలను పాటించటమే మనం ఇచ్చే ఘన నివాళి అని కొనియాడారు. ద్రవిడ సమ్మేళనం చైర్మన్ ఆకురాతి మురళీకృష్ణ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ‘ఉసా’ అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఆయన రచనల్ని విస్తృతంగా గ్రామస్థాయి వరకు తీసుకువెళ్లాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో బీసీ నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగలక్ష్మి, బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.వి. రమణయ్య, బీసీ మహాజనసభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్, రజక సంఘం రాష్ట్ర నాయకుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శివ పూర్ణయ్య, మేకల సుబ్బారావు, పలకలూరు శివరావు పాల్గొన్నారు.

శ్రీ మల్లికార్జునస్వామికి విశేష పూజలు


విశేష అలంకారంలో స్వామి

గుంటూరు ఎడ్యుకేషన్: మహా శివరాత్రి సందర్భంగా మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఉత్సవ మూర్తులు విశేష అలంకారంలో దర్శనమిచ్చారు. శనివారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో స్వామికి నిర్వహించిన మహా రుద్రాభిషేకం ఆదివారం తెల్లవారుజామున 3.00 గంటల వరకు కొనసాగింది అనంతరం విశేష అలంకారాలు చేశారు. ఆదివారం హోమ క్రతువు నిర్వహించిన ఆలయ కమిటీ ప్రతినిధులు, మధ్యాహ్నం భక్తులకు భారీగా అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

అలరించిన అఖండ సంగీతార్చన


కీర్తనలు ఆలపిస్తున్న భారతీదేవి, శిష్య బృందం

పాత గుంటూరు: శ్రీ భారతి సంగీత నిలయం వ్యవస్థాపకురాలు అంపేరాయని భారతీదేవి ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక మందిరం కళావేదికపై మహాశివరాత్రి సందర్భంగా నిర్విరామంగా 12వ అఖండ సంగీతార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 24 గంటల పాటు నిర్వహించిన సంగీతార్చన ఆదివారం ఉదయం 6 గంటల వరకు అనేక మంది కళాకారుల సంగమంతో విశేషంగా జరిగింది. ప్రత్యేక కార్యక్రమాల్లో భారతీదేవి శిష్య బృందంతో వీణ త్రయంలో అనేక వాగ్గేయకార కృతుల్ని శ్రావ్యంగా పలికించి ప్రేక్షకుల్ని అలరించారు. రుద్ర కళాపీఠం నాట్యాచార్యులు రాజేష్ కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు కోగంటి వెంకట రంగనాయకి, డాక్టర్ రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ దంపతులు భారతీదేవి సంగీత సేవల్ని కొనియాడారు. పుష్కర కాలంగా అఖండ సంగీతార్చన నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం కళాకారులు, అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి దుద్దుకూరి శ్యామసుందర్ పర్యవేక్షించారు.

ఎస్‌ఐ అభ్యర్థులకు పోలీసుల సాయం

సమయానికి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లిన కాకుమాను ఎస్‌ఐ


అభ్యర్థులను పోలీసు వాహనంలో తీసుకువచ్చిన కాకుమాను ఎస్‌ఐ రవీంద్రబాబు

చేబ్రోలు: ఎస్‌ఐ ప్రిలిమినరీ పరీక్షలు రాయడానికి వచ్చి బస్సులు అందక ఇబ్బంది పడుతున్న ముగ్గురు విద్యార్థులకు పోలీసులు సాయం చేశారు. సకాలంలో పరీక్ష కేంద్రం వద్ద తమ వాహనంలో దింపారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌ఐ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళగిరికి చెందిన ముగ్గురు విద్యార్థులు విజ్ఞాన్‌లో పరీక్షలు రాయటానికి ఆర్టీసీ బస్సులో నారాకోడూరు వచ్చారు. వారు వచ్చే సమయానికి 9.55 గంటలు అయింది. పది గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. ఈ సమయంలో విద్యార్థుల టెన్షన్‌ను గమనించిన కాకుమాను ఎస్‌ఐ డి.రవీంద్రబాబు విద్యార్థులను తమ వాహనంలో ఎక్కించుకొని విజ్ఞాన్ లారా కళాశాలలోని పరీక్షా కేంద్రం లోపలికి తీసుకు వెళ్లారు. నిమషం ఆలస్యమైనా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవకాశం దక్కేది కాదు. పోలీసుల సహకారానికి అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ సూచనల ప్రకారం అత్యవసర సమయంలో విద్యార్థులకు సహకారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

వీవీఐటీ విద్యార్థుల శివోహం

పెదకాకాని: మండలంలోని నంబూరు వీవీఐటీలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఆదివారం శివోహం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గుంటూరు విశ్వనాథ అకాడమీ జానపద కళాకారులకు అందించే విశ్వనాథ సంస్కృతి పురస్కార వేడుకను నిర్వహించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విశ్వనాథ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ మద్దినేని సింహకొటిల్య చౌదరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హరికథా చూడామణి ఎం. సింహాచల శాస్త్రికి విశ్వనాథ సంస్కృతి పురస్కారం 2023ను అందించి సత్కరించారు. శివోహం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం సింహాచల శాస్త్రి గిరిజా కల్యాణం హరికథాగానం చేశారు. అనంతరం విద్యార్థులు నంబూరు శివాలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురవటంతో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామం వద్ద జరిగింది. వేజండ్ల గ్రామానికి చెందిన షేక్ ఆలీ ద్విచక్ర వాహనంపై శలపాడు గ్రామానికి బయలు దేరాడు. మార్గంమధ్యలో సుద్దపల్లి గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న రెండు పెద్ద బ్రిక్స్ రాళ్లను గమనించకపోవటంతో వాటిని ఢీకొట్టాడు. బైక్ అదుపు తప్పి, కిందపడిపోయాడు. ఆలీ కుడికాలు విరగటంతోపాటు, ముఖానికి, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బస్టాండ్లోకి వెళ్లని ఆర్టీసీ బస్సులు



ప్రత్తిపాడు: ఆర్టీసీ అధికారుల తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజుకోరకంగా పూటకో చోట బస్సులను నిలిపి ఉంచుతుండటంతో ప్రయాణికులకు ప్రయాస తప్పడం లేదు. గుంటూరు నుంచి ప్రత్తిపాడు మీదుగా పర్చూరు వరకు నిత్యం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తిరుగుతుంటాయి. అయితే, ఈ బస్సులు ప్రత్తిపాడులో ఎక్కడ ఆగుతాయో, ఎక్కడ ప్రయాణికులను ఎక్కించుకుంటాయో, ఎక్కడ దింపుతాయో అర్థం కాని పరిస్థితి ఉంది. పేరుకు పెద్ద ఆర్టీసీ బస్టాండ్ ఉన్నా బస్టాండు లోపలకు వచ్చే బస్సులను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ప్రతి బస్సు లోపలకు వచ్చేలా చూసేందుకు కంట్రోలర్ వ్యవస్థను ఏర్పాటు చేసినా ఫలితం ఉండటం లేదు. కొన్ని బస్సులు బస్టాండు లోపలకు వెళ్తుండగా, మరి కొన్ని బస్సులను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లోకి బస్సులన్నీ వచ్చేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలోని బొంతపాడు డొంకలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. పెదకాకాని జ్యోతీనగర్‌కు చెందిన రాశెట్టి యోహాన్(40) ఆటో డ్రైవర్. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి అత్త, భార్యను కొట్టాడు. ఇద్దరికీ గాయాలు కావడంతో వారు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. దీంతో భార్య, అత్త కేసు పెడతారనే భయంతో ఆదివారం బొంత రోడ్డు డొంక వైపునకు వచ్చిన యోహాన్ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న సీఐ మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని తండ్రి కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన



తెనాలి టౌన్: సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనలో భాగంగా శ్రీలక్ష్మీ శారదా సంగీత ఆలయం విద్యార్థులు బోసు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పంచరత్న, ఉపచార కీర్తనలు ఆలపించారు. తొలుతగా సంగీత గురువులు గొరావఝల ఆంజనేయశాస్త్రి ఇంటి నుంచి నగర సంకీర్తనలు ఆలపిస్తూ వాసవీ ఆలయానికి చేరుకున్నారు. త్యాగరాజస్వామి విరచిత ఘన రాగాల్ని విద్యార్థులు ఆలపించారు. గత 35 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంజనేయశాస్త్రి తెలిపారు. తీర్థప్రసాదాలు వితరణ చేశారు. మృదంగంపై వెంకట రామకృష్ణ, వైలెన్‌పై శ్రీకృష్ణ అభిరామ్, ఆంజనేయశాస్త్రి సహకరించగా, కొండపి శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్తీక్, సౌజన్య, కుమార శ్యామ్‌కృష్ణ శర్మ, అరుణ, వల్లి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో ‘స్పందన’

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోను ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

నేడు డయల్ యువర్ కార్పొరేటర్

నగరంపాలెం: డయల్ యువర్ కార్పొరేటర్ కార్యక్రమాన్ని సోమవారం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు 18వ డివిజన్ కార్పొరేటర్, జీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు నిమ్మల వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని స్థానిక సమస్యలపై 8500006458 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న లఘు నాటికలు



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళా వేదికపై హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 100వ హాస్య వల్లరిలో భాగంగా ప్రదర్శించిన లఘు నాటికలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బావగారొచ్చారు, తగ్గేదిలే, అనుకున్నదొక్కటి, కరోనా పిలుపులు, ఓపెన్ హార్ట్ విత్ పీకె, డాక్టర్, పేషెంట్, మైమ్, ఏమంటివి నాటికల్ని ప్రదర్శించారు. అనంతరం కళాకారుల్ని సత్కరించారు. కార్యక్రమంలో ముంజులూరి లలిత, క్లబ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ జె. కిశోర్‌బాబు, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ లాల్ వజీర్, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు.

దేశాన్ని శక్తివంతం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి

పాత గుంటూరు: భారతదేశాన్ని అన్ని రంగాల్లో శక్తిశాలిగా చేసి సుసంపన్నంగా చేయడానికి స్వయం సేవక సంఘ్ నిరంతరం కృషి చేస్తోందని ముఖ్య వక్త, ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు తెలిపారు. హిందూ కళాశాల వెనుక సారిక మైదానంలో ఆదివారం రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్, నగర సాంఘిక్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బయ్యా వాసు మాట్లాడుతూ సంఘం ప్రారంభమై వంద ఏళ్లకు చేరువవుతున్న తరుణంలో నగరంలోని స్వయం సేవకులు దేశసేవకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర సంఘ చాలక్ డాక్టర్ ఆళ్ల శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి శోభాయాత్ర

హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. సారిక మైదానం నుంచి కొరిటెపాడు పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు.

బీజేపీకి వెస్ట్ ఇన్‌చార్జి పాలిశెట్టి రాజీనామా

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలిశెట్టి రఘు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం గుంటూరు కన్నావారితోటలోని కన్నా నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన తన రాజీనామా విషయాన్ని వెల్లడించారు. కన్నాకు అనుచరుడిగా ఉన్నా రఘుతో పాటు బీజేపీలో వివిధ పదవుల్లో ఉన్న నిజాముద్దీన్, నీలం ప్రసాద్, మాధవరావు, లక్ష్మణ్, దేసు సత్యనారాయణ, బోరుగడ్డ బుల్లిబాబు, దినేష్‌కుమార్ తదితరులు బీజేపీకి రాజీనామా చేశారు. వీరంతా కన్నాతో పాటుగా టీడీపీలో చేరనున్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు సరుకుల పంపిణీ



నగరంపాలెం: కొత్తపేట సోమువారి వీధిలోని గిరిధారి మిత్ర మండలి కార్యాలయంలో ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర కిట్లను అందించారు. వయసు పైబడిన వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరి శివరావు, సభ్యులు పి.వి. సంజీవరావు, గార్లపాటి రోశయ్య, సీహెచ్.వి.సుబ్బారావు, మాచర్ల ఉపేంద్ర, దిండు రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫ్యాన్సీ షాపులో చోరీ

తెనాలి రూరల్: పట్టణంలోని ఫ్యాన్సీ షాపులో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ బోసు రోడ్డులోని కార్తికేయ ఫ్యాన్సీ షాపులో ఈ నెల 17న చోరీ జరిగింది. మూసి ఉన్న దుకాణంలో రూ. 14 వేలను దుండగులు అపహరించారు. ఈ మేరకు దుకాణ నిర్వాహకులు ఆదివారం వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించగా, కేసు నమోదు చేశారు.